నూతన కార్యవర్గం

మీర్‌పేట: హరితపురి కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కంచర్ల జయందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా విద్యాసాగర్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా రాఘవేంద్ర రావు, సంయుక్త కార్యదర్శిగా ఆర్.శ్రీధర్‌రావు, కోశాధికారిగా పి.శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

మూసీ నివాసితుల సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తా

చైతన్యపురి: చైతన్యపురి, కొత్తపేట డివిజన్లలోని మూసీ పరీవాహక నివాసితుల సమస్యను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. చైతన్యపురి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో పలు కాలనీల మహిళలు ఫోన్‌లో తమ సమస్యను మధుయాష్కీకి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైడ్రా కూల్చివేతల విషయంలో ఎవరికీ నష్టం జరగకుండా చూడాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేదలకు ఇంటి స్థలాలు, ఇళ్లు ఇచ్చిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదే అన్నారు. ప్రస్తుతం రివర్‌బెడ్‌లో ఉన్న ఇళ్లను ఖాళీ చేయించటం జరుగుతుందని ప్రతిపక్షాలు సోషల్ మీడియాలు ప్రజల్లో గందరగోళం సృష్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మలక్‌పేట: మలక్‌పేట ఉన్నత పాఠశాల 1992 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం స్థానిక పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు నాటి గురువులను సన్మానించారు. చిన్ననాటి జ్ఞాపకాలను పంచుకుని ఒకరికొకరు తమ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జనగాం జిల్లా విద్యాశాఖాధికారి కే.రాము, హిమయత్‌నగర్ డిప్యూటీ ఈవో, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానం

మహేశ్వరం: మండల కేంద్రంలో ఎంపీడీవో సమావేశం హాల్లో సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానం చేయనున్నట్లు ఎంఈఓ కస్నా నాయక్ పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సబితారెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు. అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు.

అంతా మా ఇష్టం!

కాలనీవాసుల ఇబ్బందులు వారికి పట్టవు. నత్తనడకన సాగే అభివృద్ధి పనులతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. సకాలంలో పూర్తి చేయాల్సిన పనులను ఇష్టానుసారంగా ప్రారంభిస్తారు.. వారికిష్టం వచ్చినప్పుడు ఆపేస్తారు. అధికారుల నిర్లక్ష్యంతో కాలనీ, బస్తీవాసులు ఇబ్బందులు పడుతున్నా తమకు సంబంధం లేనట్లుగా వ్యవహరిస్తున్నారని అధికారుల పనితీరుపై స్థానికులు మండిపడుతున్నారు.
– చంపాపేట





నిలిచిపోయిన పనులతో కంకర తేలిన రోడ్డు

- నత్తనడకన అభివృద్ధి పనులు
- చినుకులకే మునుగుతున్న కాలనీలు
- సకాలంలో పూర్తి చేయాలంటున్న స్థానికులు
- విస్మరిస్తున్న అధికారులు

ఆరు నెలల క్రితం ప్రారంభం..

చంపాపేట డివిజన్ పరిధిలో ఎస్‌జీఆర్, మారుతీనగర్, బైరామల్‌గూడ చెరువు సమీపంలోని హరిజన బస్తీలో ఎస్ఎన్‌డీపీ నిధులతో ఆరు నెలల క్రితం ప్రారంభించిన వరదనీటి కాలువలు..పద్మానగర్, నిర్మలానగర్, రాజిరెడ్డి నగర్, సాయిరాంనగర్, న్యూమారుతీనగర్ కాలనీలో సీసీ రోడ్డు పనులు నత్తనడకన సాగుతున్నాయి.ఇటీవల కురుస్తున్న వర్షాలతో తవ్వి వదిలేసిన రోడ్లు, నిర్మాణ దశలోని వరదనీటి కాలువల్లో భారీగా నీరు చేరి కుంటను తలపిస్తున్నాయి. అర్ధాంతర పనులతో ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాకపోకలకు తీవ్ర ఇబ్బదులు తలెత్తినా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యే ఆదేశాలిచ్చినా..

అభివృద్ధి పనులను వర్షాకాలానికి ముందే పూర్తి చేయాలని స్థానిక ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి కాంట్రాక్టర్లు, సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించటంతో పాటు తరచూ ఆయా కాలనీల్లో పర్యటిస్తూ ఆదేశాలిచ్చినా అధికారులు మాత్రం వాటిని లెక్క చేయకుండా పనుల్లో జాప్యం చేస్తూనే ఉన్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎస్‌జీఆర్, మారుతీనగర్, రెడ్డి కాలనీ, దుర్గాభవానీనగర్ వంటి లోతట్టు ప్రాంతాలతో పాటు ఉన్న రోడ్లు తవ్వడంతో వరద, మురుగు నీటి కాలువలు మారిన బైరామల్‌గూడ పాతబస్తీ, పద్మానగర్, సాయిరాంనగర్, నిర్మలానగర్ వంటి కాలనీవాసులకు నడకే నరకంగా మారిందని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అభివృద్ధి పనుల్లో వేగం పెంచేలా చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంతాల వారు కోరుతున్నారు.

పనుల్లో వేగం పెంచాలి..



ఎస్‌జీఆర్, మారుతీనగర్, బైరామల్‌గూడ చెరువు సమీపంలోని హరిజన బస్తీలో వరదనీటి కాలువ నిర్మాణం కోసం గత కొన్ని నెలలుగా గుంతలు తవ్వి వదిలేశారు. తరచూ కురుస్తున్న భారీ వర్షాలకు గుంతలు నిండా మురుగు వరదనీరు చేరి సమీపంలోని ఇళ్లల్లోకి చేరే ప్రమాదం ఉంది. పనుల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తయ్యేలా చొరవ చూపాలి. –మల్లేష్, కర్మన్‌ఘాట్

ఇళ్లు వదిలేసే పరిస్థితి వస్తోంది..



చిరుజల్లులు కురిస్తేనే మాలో గుబులు మొదలవుతోంది. మారుతీనగర్, దుర్గాభవానీనగర్, ఓవైసీ కాలనీ, పోచమ్మగడ్డ వంటి పలు ఎగువ కాలనీల నుంచి వరద వచ్చి మా కాలనీలను ముంచెత్తుతోంది. డీ–మార్టు వరకు వరదనీటి కాలువను ఏర్పాటు చేసి అవుట్‌లెట్ ఇవ్వకుండానే మాకాలనీ ప్రధాన రహదారిపై నీరు ప్రవహించేటట్లు వదిలేశారు. ఇటీవల కురిసిన వర్షానికి మా కాలనీ అంతర్గత రహదారులపై వరద ఏరులై పారింది. వర్షాకాలం వస్తే ఇళ్లు వదిలేసే పరిస్థితి వస్తోంది.
– అంబయ్య, రెడ్డి కాలనీ

ఇంటి ముందే గుంతలు..



చంపాపేట చౌరస్తాలో మానసాగార్డెన్ నుంచి రోజ్ గార్డెన్ వరకు గత నాలుగు నెలల క్రితం ప్రధాన రహదారి విస్తరణ కోసం గోతులు తవ్వి వదిలేశారు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఒకటి రెండు రోజులు పనులు చేస్తున్నట్లు హడావుడి చేసి ఆ తర్వాత ఇటువైపు కన్నెతి చూడటం లేదు. ఇంటి ముందు గుంతలు తవ్వటంతో ఇళ్లల్లోకి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది అధికారులు వెంటనే స్పందించి పనులు పూర్తి చేయాలి.
– మంత్రి జగన్, నేతాజీనగర్

ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతా



పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ అరుణరవీందర్‌రెడ్డి

సైదాబాద్: సైదాబాద్‌ను నగరంలోనే ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతా అని కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని వెంకటాద్రినగర్ రాక్ చర్చి వద్ద నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ఆదివారం ఆమె జీహెచ్ఎంసీ అధికారులు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. సైదాబాద్‌లోని కాలనీలు, బస్తీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, అంజయ్య, శ్రీధర్ పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి



సభ్యత్వ నమోదు చేయిస్తున్న సురేందర్ యాదవ్

నాగోలు: తెలంగాణలో బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల సురేందర్ యాదవ్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా ఆదివారం నాగోలు డివిజన్ బండ్లగూడలోని సహ భావన టౌన్‌షిప్‌లో సీ–బ్లాక్‌లో సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సురేందర్ యాదవ్ మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ జెండా ఎగరవేయాలని పిలుపునిచ్చారు. పార్టీని ఇప్పటి నుంచే బలోపేతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాధిక, గజ్జల శేఖర్, శివ కుమార్, పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉంటాం



చైతన్యపురి: న్యాయం జరిగే వరకు బాధితులకు అండగా ఉంటామని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామరంగారెడ్డి అన్నారు. చైతన్యపురి డివిజన్ కార్పొరేటర్ రంగానర్సింహాగుప్తా ఆధ్వర్యంలో ఆదివారం మూసీ సమీప కాలనీలవాసులతో కలిసి వంటావార్పు కార్యక్రమం నిర్వహించి సామూహిక భోజనాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత వారం రోజులుగా మూసీ పరీవాహక ప్రాంత ప్రజలు కంటిమీద కునుకు లేకుండా భయాందోళనతో కాలం గడుపుతున్నారన్నారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం అని చెప్పుకునే రేవంత్‌రెడ్డి ఓట్లేసిన పేద, మధ్య తరగతి ప్రజలకు తీవ్ర నష్టం జరిగేలా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్, నాయకులు శంకర్, వినోద్‌యాదవ్ పాల్గొన్నారు.

వాసవి శ్రీనిలయంలో ఉచిత వైద్య శిబిరం



వనస్థలిపురం: ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా ఆదివారం వనస్థలిపురం డివిజన్ పరిధి ఆర్టీసీ కాలనీలోని వాసవి శ్రీనిలయంలో కామినేని ఆసుపత్రి, వాసవి శ్రీనిలయం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి హాజరైన వారికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేశారు. ఈ సందదర్భంగా కార్డియాలజిస్ట్ శివప్రసాద్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు నిత్యం వ్యాయామం చేయాలన్నారు. కట్టా భరత్, గార్లపాటి రవిందర్‌రెడ్డి, శంకర్, రఘునందన్, కనకేశ్వర్‌రావు పాల్గొన్నారు.

నేరాల కట్టడికి సీసీ కెమెరాలు దోహదం



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఏసీపీ కాశిరెడ్డి

హస్తినాపురం: నేరాల కట్టడికి సీసీ కెమెరాలు దోహదపడుతాయని వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి అన్నారు. సాహెబ్‌నగర్ పరిధిలోని బృందావన్ మెడోస్ కాలనీలో కాలనీవాసులు ఏర్పాటు చేసుకున్న 20 సీసీ కెమెరాలను శనివారం రాత్రి ఆయన ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కాశిరెడ్డి మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్ పరిధిలోని చాలా ప్రాంతాలలో సీసీ కెమెరాలు ఉన్నాయని అన్ని కాలనీలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటూ నేరాలను పూర్తిస్థాయిలో కట్టడి చేయవచ్చన్నారు.

కాలనీ అభివృద్ధికి కృషి చేస్తాం



నూతన కార్యవర్గ సభ్యులు

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని శ్రీపురం కాలనీ ఫేజ్–2 నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అధ్యక్షుడిగా కాల్వ శ్రీధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి విఠల్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా సికిందర్‌రెడ్డి, కోశాధికారిగా జంగయ్య గౌడ్, సంయుక్త కార్యదర్శులుగా నరసింహారెడ్డి, సత్తు వెంకటరమణ రెడ్డి, సలహాదారులుగా విష్ణువర్ధన్ రెడ్డి, బృంగి శిరిష్‌కుమార్, కార్యదర్శులుగా కన్నారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, బండారు లక్ష్మీ నారాయణ, సభ్యులుగా సుహాసిని, పురుషోత్తం రెడ్డి, రేణుక, చలపతిరెడ్డి, శ్వేత, శశివర్ధన్‌రెడ్డి, రాజేందర్, రాజును ఎన్నుకున్నారు. కాలనీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తామని ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు హామీ ఇచ్చారు.

ఇళ్లు కూల్చాలంటే బుల్డోజర్లు నన్ను దాటుకుని రావాలి

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



మూసీ నివాసితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చైతన్యపురి: మూసీ నివాసితుల ఇళ్లపైకి బుల్డోజర్లు వెళ్లాలంటే ముందుగా నన్ను దాటుకుంటూ వెళ్లాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. మూసీ సమీప కాలనీల ప్రజలతో ఆదివారం ఫణిగిరి కాలనీ సాయిబాబా ఆలయం వద్ద సమావేశమయ్యారు.రెవెన్యూ అధికారులు నెలరోజులుగా తమను ఇళ్లు ఖాళీ చేసి వెళ్లాలని రెడ్ మార్కింగ్ చేస్తూ భయాభ్రాంతులకు గురిచేస్తున్నరని పలువురు నివాసితులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. మూసీ సుందరీకరణ పనులు 2021లోనే రూ.14వేల కోట్ల నిధులతో ప్రారంభించామని కానీ పేదలు, మధ్య తరగతి వారి ఇళ్లను ముట్టుకోలేదన్నారు. ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా చేయాల్సింది పోయి ఇష్టానుసారంగా వ్యవహరిస్తోందని ఎమ్మెల్యే మండిపడ్డారు. ప్రజావసరాల కోసం స్థలం ఇస్తే వారికి మూడురెట్లు నష్టపరిహారం ఇవ్వాలని 2013లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పార్లమెంట్‌లో ఓ చట్టం తీసుకొచ్చిందని అదే విధంగా మూసీ నివాసితులకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే వెంట నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, తోట మహేష్‌యాదవ్, రమణారెడ్డి గట్టు శ్రీను ఉన్నారు.

వ్యాయామం, పౌష్టికాహారంతో ఆరోగ్యం



రన్‌ను ప్రారంభిస్తున్న సత్తయ్యగౌడ్

సైదాబాద్: నిత్యం వ్యాయామం, పౌష్టికాహారంతో చక్కని ఆరోగ్యం లభిస్తోందని సైబర్ సెక్యూరిటీ డీఎస్‌పీ సత్తయ్యగౌడ్ అన్నారు. వరల్డ్ హార్ట్ డే పురస్కరించుకొని ఆదివారం చంపాపేటలోని ఓనస్ హార్ట్ ఇనిస్టిట్యూట్, ఓనస్ రోబోటిక్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన 5కె రన్‌ను ఆయన జెండాఊపి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో అందరూ గుండె ఆరోగ్యానికి తప్పనిసరిగా ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఓనస్ హాస్పిటల్స్ ఎండీ డాక్టర్ బాలరాజు నాయుడు మాట్లాడుతూ.. 40 ఏళ్లు దాటిన వారందరూ తరచూ రక్త పరీక్షలు చేయించుకుంటూ వైద్యుల సలహాలు పాటించాలని సూచించారు. బిజీలైఫ్ పేరుతో బయటి పదార్థాలు తినటంతో అనారోగ్యాన్ని కొని తెచ్చుకున్నట్లు అవుతుందని నడక, వ్యాయామం, యోగాలను దైనందిన జీవనంలో భాగస్వామ్యం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లక్కిరెడ్డి కిరణ్ కుమార్‌రెడ్డి, డాక్టర్ రవికిరణ్ పాల్గొన్నారు.

ప్రొస్టేట్ కేన్సర్‌పై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

మలక్‌పేట: ప్రొస్టేట్ కేన్సర్‌కు ముందస్తు పరీక్షలు చేయించుకోవడమే తరుణోపాయమని ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ, యూరాలజీ(ఏఐఎన్‌యూ) దిల్‌సుఖ్‌నగర్ ఫెసిలిటీ సీనియర్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డాక్టర్ ఎన్. శ్రీనివాస్ అన్నారు. ఆదివారం నిర్వహించిన 'ప్రొస్టేట్ కేన్సర్‌పై అవగాహన నడక'లో ఆయన పాల్గొని మాట్లాడారు. సెప్టెంబర్ నెలను ప్రొస్టేట్ కేన్సర్ అవగాహన మాసంగా గుర్తించి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రతీ ఏడుగురు పురుషుల్లో ఒకరు ప్రొస్టేట్ కేన్సర్ బారిన పడుతున్నారన్నారు. శరీరమంతా విస్తరించే వరకు దాని లక్షణాలు అంత త్వరగా బయటపడవన్నారు. 50 ఏళ్లు నిండిన పురుషులు ఏడాదికోసారి ప్రొస్టేట్ స్పెసిఫిక్ ఎగ్జామినేషన్ చేయించుకుంటే వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ యూరాలజిస్టు డాక్టర్ సుభాష్‌చంద్రబోస్, డాక్టర్ దీప్తి, నెఫ్రాలజిస్టు డాక్టర్ వలీ, ఎనస్థీషియన్లు స్నిగ్ధ, రామకృష్ణ, రఘునాథ్, సల్మాన్ పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమోటా రూ.49, వంకాయ రూ.35, బెండ రూ.40, పచ్చిమిర్చి రూ.28, కాకరకాయ రూ.35, బీరకాయ రూ.28, కాలిఫ్లవర్ రూ.23, క్యాబేజీ రూ.19, క్యారెట్ రూ.35, దొండ రూ.35, ఆలుగడ్డ రూ.36, ఉల్లిగడ్డ రూ.54, గోకరకాయ రూ.40, దోసకాయ రూ.28, సొరకాయ రూ13, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.50, అర్వి రూ.40, మునగ రూ.85, చిలుకడ దుంప రూ.55, బీట్‌రూట్ రూ.28, కీర రూ.18, బీన్స్ రూ.55, క్యాప్సికమ్ రూ.55.

కల్యాణ మండపంలో అగ్నిప్రమాదం

చాదర్‌ఘాట్: ఓల్డ్‌మలక్‌పేట డివిజన్ రామయంద్రస్వామి కల్యాణ మండపంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డివిజన్ పరిధిలో స్వామి వారి కల్యాణ మండపంలో విద్యుదాఘాతం సంభవించి 10 ప్లాస్టిక్ కుర్చీలు దగ్ధం అయ్యాయన్నారు.

వ్యక్తి అదృశ్యం

నాగోలు: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. నాగోలు జైపురికాలనీలో నివాసముండే కొలుకూరి హనుమంతురావు(48) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 19న ఉదయం కటింగ్ చేయించుకోవడానికి వెళ్తున్నాని భార్య జయశ్రీకి చెప్పి కారు తీసుకుని వెళ్లి రాత్రైనా రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు బంధువులు, తెలిసిన వారితో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో ఆదివారం జయశ్రీ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

మలక్‌పేట: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మలక్‌పేట పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన మానీష్(32 భార్యతో కలిసి బతుకుదెరువు కోసం మూడేళ్ల క్రితం నగరానికి వచ్చి మూసారంబాగ్ శాలివాహననగర్‌లో ఉంటున్నారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో పని చేసి రెండేళ్లుగా ఖాళీగా ఉన్నాడు. అతని భార్య ప్రైవేటు ఉద్యోగం చేస్తోంది. షేర్ మార్కెట్‌లో డబ్బులు పెట్టి ఆర్థికంగా నష్టపోయాడు. ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు.

అధికారుల సమన్వయ లోపంతో ఇక్కట్లు



ధ్వంసమైన రోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: జీహెచ్ఎంసీ, ఆర్అండ్‌బీ అధికారుల సమన్వయ లోపంతో కాలనీల వాసులు ఇబ్బందులు పడుతున్నారని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. డివిజన్ పరిధి ఆగమయ్యనగర్‌కాలనీ కేఎల్ఎం షాపింగ్‌మాల్ వద్ద ధ్వంసమైన రోడ్డును ఆదివారం పరిశీలించి కాలనీవాసులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. జాతీయ రహదారి అభివృద్ధిలో భాగంగా కనెక్టివిటీ రోడ్లు ధ్వంసమై, ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ధ్వంసమైన రోడ్లకు మరమ్మతు చేయాల్సిన కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని, చర్యలు చేపట్టాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ధ్వంసమైన రోడ్లకు మరమ్మతు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు వేణారెడ్డి, కరుణాకర్, రామేందర్, వృషికుమార్, వెంకటేశ్వర్‌రావు, భాస్కర్‌రావు,గిరిప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

కాలనీలో కార్పొరేటర్ పర్యటన



కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: ప్రణాళికాబద్ధంగా కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి తెలిపారు. డివిజన్ పరిధిలోని వివేకానంద కాలనీలో నూతన రోడ్ల నిర్మాణానికి స్థానికుల విజ్ఞప్తి మేరకు ఆదివారం ఆయన పర్యటించారు.ఈ సందర్భంగా కాలనీ వాసులు వివిధ సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. నూతన రోడ్ల నిర్మాణ పనులను త్వరలో ప్రారంభిస్తామన్నారు. కార్పొరేటర్ వెంట వెంకటాచలం, నరసింహా, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, శ్రీకాంత్, విక్రమ్, శ్రీనివాస్, సూర్యనారాయణ, మోహన్, భ్రమరాంబ, సృజన, పద్మ, దివ్య, రాజేందర్‌రెడ్డి ఉన్నారు.

సర్కార్ బడుల్లో ఫేస్ రికగ్నైజేషన్ సిస్టం



విద్యార్థిని వివరాలు ఫోన్‌లో నమోదు చేసుకుంటున్న ఉపాధ్యాయుడు

చాదర్‌ఘాట్: సర్కారు బడుల్లో మౌలిక సదుపాయాలు, విద్యార్థుల వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు ఫేస్ రికగ్నైజేషన్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. అన్ని పాఠశాలలో గత నెల రోజుల నుంచి ఈ ప్రక్రియ మొదలైంది. ప్రతి తరగతి ఉపాధ్యాయుడుకి ఈ యాప్‌ను అందుబాటులో ఉంచారు. విద్యార్థి తరగతి గదిలోకి రాగానే ఉపాధ్యాయుడు తమ వద్ద ఉన్న ఫోన్, ట్యాబ్ విద్యార్థి ముఖం వద్ద ఉంచగానే పేరు, తరగతి వివరాలు తెరపై కనిపిస్తాయి. ఈ విధానాన్ని విద్యాశాఖ మలక్‌పేట, అంబర్‌పేట జోన్ పరిధిలోని 30 ప్రాథమిక, 20 ఉన్నత పాఠశాలలో అమలు చేస్తున్నారు. ప్రతిరోజు టీచర్ తన తరగతి గది వద్ద విద్యార్థుల ఫొటోలు తీసుకుని లోపలికి పంపిస్తారు. అంతే కాక ఉపాధ్యాయుల హాజరు కూడా పక్కాగా నమోదయ్యేలా వారి ఫొటోలను కూడా ప్రతిరోజు ఈ యాప్‌లో నమోదు చేస్తున్నారు. ముఖ గుర్తింపు నమోదు ప్రక్రియను ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థుల పేర్లు తరగతి..అన్ని వివరాలు ఈ యాప్‌లో ఉంటాయి. ఈ ప్రక్రియ ప్రారంభం తర్వాత మలక్‌పేట, అంబర్‌పేట పరిధిలో అన్ని పాఠశాల్లో హాజరు శాతం పెరిగిందని పలువురు ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9666021515 9912220363
9505507616 9912220365